

ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
మహబూబాబాద్
ఆదివారం 22 సెప్టెంబరు 2024

బొడ్డెమ్మ బొడ్డెమ్మా.. కోల్..

ఉమ్మడి జిల్లాలో బొడ్డెమ్మ వేడుకలకు సిద్ధమైన ఆడబిడ్డలు



- రేపటి నుంచి సాగనున్న సంబురం
- తొమ్మిది రోజుల పాటు సందడే సందడి
- ఆఖరి రోజున నిమజ్జనం
- ప్రాచీన పండుగకు ఆదరణ ఏదీ?
- భావితరాలకు కనుమరుగవుతున్న వైనం

బొడ్డెమ్మ.. బొడ్డెమ్మా కోల్..
నీ బిడ్డపేరేమీ కోల్..
నీ బిడ్డ నిలగౌరీ కోల్..
నిత్య మల్లెచెట్టేసి కోల్..
చెట్టుకు చెంబేడు కోల్..
నీళ్లు పోసి కోల్..
కాయలు, పిందెలు కోల్..
ఘనమై కాసెను కోల్..
అందుట్ల ఒక పిందె కోల్..
ఢిల్లీకి పాయేను కోల్..
ఢిల్లీలో తిప్పరాజు కోల్..
మేడకట్టించే కోల్..

7లో..



......తెలంగాణ పల్లె పండుగ బొడ్డెమ్మ పండుగకు ఆడపడుచులు సిద్ధమయ్యారు. పూర్వకాలం నుంచి ఏటా బతుకమ్మ పండుగ ప్రారంభమయ్యే అమావాస్య రోజు ముందువరకు బొడ్డెమ్మ పండుగను యువతులు, బాలికలు వైభవంగా జరుపుకుంటారు. తొమ్మిది రోజుల పాటు పల్లె సుద్దుల గీతాలు, ప్రాచీన పాటలను చప్పట్లతో పాడుతూ సంబురంగా జరుపుకుంటారు. బతుకమ్మ పండుగ ప్రారంభానికి ఒక రోజు ముందుగా నిమజ్జనం చేస్తారు. ఈ వేడుక నిర్వహించుకోవడం వలన చదువు, జ్ఞానం, ఆరోగ్యం సిద్ధించి మానసికంగా ఎంతో ఆనందంతో ఉంటారని నమ్మకం. వందల ఏళ్ల నుంచి ఆచార సంప్రదాయంగా బొడ్డెమ్మ వేడుకను జరుపుకోవడం ఆనవాయితీగా వస్తోంది.

సండే స్పెషల్ SUNDAY SPECIAL

- వరంగల్ కల్చరల్

ప్రభుత్వ భూములు, చెరువుల పరిరక్షణకు

ప్రత్యేక బృందాలు

- అక్రమ నిర్మాణాలు, కబ్జాలను కట్టడి చేయాలి
- పీసీపీఎన్డీటి యాక్టును పక్కాగా అమలు పర్చాలి
- కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్



సమావేశంలో మాట్లాడుతున్న అద్వైత్‌కుమార్‌సింగ్

మహబూబాబాద్, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ భూములు, చెరువుల పరిరక్షణ కోసం ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేయడంతో పాటు పీసీపీఎన్డీటి యాక్టును పకడ్బందీగా అమలు చేయాలని కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఎస్పీసుధీర్‌రామ్‌నాథ్ కేకన్, అదనపు కలెక్టర్ లెనిన్‌వత్సల్ టొప్పో, సంబంధిత అధికారులతో శనివారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ భూములు, చెరువుల పరిరక్షణ కోసం పక్కా ప్రణాళిక ప్రకారం ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేస్తామన్నారు. ఎఫ్‌టీఎల్, బఫర్‌జోన్‌లలో అక్రమ నిర్మాణాలను గుర్తించి సంబంధిత రెవెన్యూ, ఇరిగేషన్, పోలీస్, పంచాయతీరాజ్, సర్వేయర్స్ సిబ్బందితో కలిసి క్షేత్రస్థాయిలో పరిశీలించాలన్నారు. ప్రభుత్వ భూములు, చెరువులను కబ్జా చేస్తే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఇందుకోసం మండల, డివిజన్‌స్థాయిలో బృందాలు ఏర్పడి ప్రతీ పదిహేను రోజులకోకసారి సమీక్ష సమావేశం నిర్వహించాలన్నారు. అక్రమ నిర్మాణాలు, అక్రమ కబ్జాలను కట్టడి చేయాలన్నారు. పీసీపీఎన్డీటి యాక్టును పక్కాగా అమలు చేసేందుకు సంబంధిత వైద్య సిబ్బంది క్రమం తప్పకుండా ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, ప్రైవేట్ ఆస్పత్రుల్లో సర్వే నిర్వహించాలని, లింగనిర్ధారణ పరీక్షలు నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. పక్కాగా రిజిస్ట్రేషన్ ఉన్న ఆస్పత్రులు మాత్రమే కార్యకలాపాలు నిర్వహించాలని, నిత్యం పోలీస్, రెవెన్యూ, వైద్యఆరోగ్యశాఖ సిబ్బంది ప్రైవేట్‌నర్సింగ్ హోమ్‌లు, స్కానింగ్‌సెంటర్లపై గట్టి నిఘా పెట్టాలన్నారు.

ఎస్పీ సుధీర్ రామ్‌నాథ్‌కేకన్ మాట్లాడుతూ ప్రభుత్వభూములు, చెరువులు, కుంటలను కబ్జాలు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. గ్రామాల్లో, పట్టణాల్లో ప్రజల ఆరోగ్య పరిస్థితులను పీఎంపీ, ఆర్ఎంపీ వైద్యుల ద్వారా వివరాలు సేకరించాలన్నారు. అదనపు కలెక్టర్ లెనిన్ వత్సల్ టొప్పో మాట్లాడుతూ జిల్లాలో ప్రభుత్వ భూములు, చెరువుల పరిరక్షణ కోసం ప్రత్యేక బృందాలు వెంటనే చర్యలు ప్రారంభించాలని చెప్పారు. ఆర్డీవోలు అలివేలు, నరసింహరావు, జిల్లా అధికారులు సమ్మిరెడ్డి, హరిప్రసాద్, నరేష్, నరసింహమూర్తి, మునిసిపల్ కమిషనర్లు, పంచాయతీరాజ్, పోలీస్‌శాఖ అధికారులు పాల్గొన్నారు.

స్థానిక సంస్థల ఎన్నికల్లో సత్తా చాటాలి..

- పీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్
- గాంధీ భవనంలో ఉమ్మడి వరంగల్ జిల్లా పార్టీ నేతలతో సమావేశం
- పాల్గొన్న ఎమ్మెల్యేలు, ఎంపీలు, సీనియర్ నాయకులు

6లో..

ఉరుములు, మెరుపులతో వర్షం

నర్సింహులపేట, సెప్టెంబరు 21 : మండల కేంద్రంతో పాటు రామన్నగూడెం, కౌసల్యదేవిపల్లి, పడమటిగూడెం, పెద్దనాగారం గ్రామాల పరిధిలో శనివారం సాయంత్రం వర్షం కురిసింది. ఒక్కసారిగా మేఘాలు కమ్ముకొని వాన కురవడంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. నర్సింహులపేటలో వారాంతపు సంత కావడంతో చిరువ్యాపారులకు ఇబ్బందులు తలెత్తాయి. నర్సింహులపేటలో 33 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైనట్లు సంబంధిత అధికారులు తెలిపారు. రబీ సీజన్‌కు సంబంధించిన వేరుశెనగ విత్తనాలు విత్తేందుకు మండలంలోని రైతులు సన్నద్ధమౌతున్నారు.



నర్సింహులపేటలో కురుస్తున్న వర్షం

పిడుగు పాటుకు వేపచెట్టు ధ్వంసం

● దంతాలపల్లి : మండలంలోని తూర్పుతండాలో పిడుగుపాటుకు వేపచెట్టు ధ్వంసమైంది. గుగులోతు లాలా ఇంటి ఆవరణ ఉన్న వేపచెట్టుపై పిడుగు పడడంతో చెట్టు వేర్ల నుంచి కొమ్మల వరకు చీలికలు వచ్చాయి. దీంతో తండావాసులు పిడుగుపాటు ప్రమాదకరమని బావిస్తూ భయాందోళనకు గురయ్యారు.



తూర్పుతండాలో పిడుగుపాటుకు దెబ్బతిన్న వేపచెట్టు



గోపాలపురంలో పిగుడు పాటుకు మృతి చెందిన పాడిగేదె

పాడిగేదెలు మృతి

● గార్ల : మండల పరిధిలోని గోపాలపురంలో గాలివాన దుమారం, ఉరుములు, మెరుపులతో పిడుగుపడి, పాడిగేదెలు మృత్యువాత పడ్డాయి. గ్రామానికి చెందిన చింతల కోటేశ్వరరావు చెందిన రెండు పాడిగేదెలు రోజువారిగా మేతకు వెళ్లాయి. శనివారం సాయంత్రం అంగోత్ తండా సమీపంలో పిడుగు పాటుకు గురై గేదెలు మృతి చెందాయి. ఈ గేదెల విలువ సుమారు రూ. 2 లక్షలు ఉంటుందని బాధిత రైతు తెలిపారు.

నేడు కేంద్రమంత్రి జార్జి కురియన్ రాక



మహబూబాబాద్, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి) : జిల్లా కేంద్రానికి ఆదివారం కేంద్ర మత్స్య, పశుసంపద, మైనార్టీ వెల్ఫేర్ సంక్షేమ శాఖమంత్రి జార్జి కురియన్ వస్తున్నారు. ఈ మేరకు బీజేపీ పార్టీ జిల్లా అధ్యక్షుడు యలమంచిలి వెంకటేశ్వర్‌రావు శనివారం తెలిపారు. మానుకోట పట్టణంలోని బీజేపీ జిల్లా కార్యాలయంలో ఉదయం 11 గంటలకు కేంద్ర మంత్రి కురియన్ హాజరై సభ్యత్వ నమోదును ప్రారంభించనున్నారు. మహబూబాబాద్ పార్లమెంటరీ నియోజకవర్గ పరిధిలోని నర్సంపేట, డోర్నకల్, ఇల్లందు, మానుకోట అసెంబ్లీ సెగ్మెంట్‌ల ముఖ్యకార్యకర్తల సమావే శం ఉంటుందని అందులో సభ్యత్వ నమోదుపై సమీక్షించనున్నారని పేర్కొన్నారు. నాలుగు అసెంబ్లీసెగ్మెంట్‌ల బీజేపీ ముఖ్యులు హాజరై సభ్యత్వ నమోదుపై మంత్రికి వివరించాలని ఆయన కోరారు.

శ్రీనవ్య రైస్ మిల్లుపై.. సివిల్ సప్లై టాస్క్‌ఫోర్స్ దాడులు

- మొగిలిచర్లలో రూ.8.36 కోట్ల విలువైన ధాన్యం గల్లంతైనట్లు గుర్తింపు
- యజమాని నాగరాజుపై కేసు నమోదు

కురవి, సెప్టెంబరు 21 : మండలంలోని మొగిలిచర్ల గ్రామంలో ఉన్న శ్రీనవ్య రైస్ మిల్లులపై రాష్ట్ర సివిల్ సప్లై టాస్క్‌ఫోర్స్, ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు శనివారం దాడులు నిర్వహించారు. రాష్ట్ర సివిల్ సప్లై ఓఎస్‌డీ ఎం.ప్రభాకర్, డీసీఎస్‌వో ప్రేమ్‌కుమార్ ఆధ్వర్యంలో ఉదయం నుంచి సాయంత్రం వరకు ఈ దాడులు నిర్వహించారు. వారు తెలిపిన వివరాల ప్రకారం. 2022-23 రబీ సీజన్‌లో శ్రీనవ్య రైస్‌మిల్లుకు 53,560 క్వింటాళ్ల ధాన్యాన్ని సివిల్ సప్లై అధికారులు మిల్లింగ్ చేసేందుకు అప్పగించారు. తర్వాత మిల్లు బాధ్యులు 36,420 క్వింటాళ్ల బియ్యాన్ని ప్రభుత్వానికి అప్పగించాల్సి ఉంది. అయితే ఇప్పటి వరకు కేవలం 8,871 క్వింటాళ్లు మాత్రమే మిల్లర్లు లెక్కలు చూపుతున్నారన్నారు. ఇంకా సుమారు 27వేల పైచిలుకు క్వింటాళ్ల బియ్యం లెక్క చూపడంలేదని అధికారులు పేర్కొన్నారు. లెక్క ప్రకారం 40,513 క్వింటాళ్ల ధాన్యం మిల్లులో ఉండాలని, కానీ 11 వేల క్వింటాళ్లు మాత్రమే ఉందన్నారు. మరికొంత ధాన్యం డోర్నకల్ మండలం గొల్లచర్ల వద్ద గోదాంలో 4,560 బస్తాలు ఉన్నాయన్నారు. ఉండాల్సిన ధాన్యం కంటే 34,273 క్వింటాళ్ల తక్కువగా ఉందని తెలిపారు. సుమారు 85,586 బస్తాల ధాన్యం ఇక్కడ గల్లంతైనట్లు గుర్తించామని అధికారులు వెల్లడించారు. దీని విలువ సుమారు రూ. 8 కోట్ల 36 లక్షల 94 వేలు ఉంటుందన్నారు. ఇంత పెద్దమొత్తంలో ధాన్యం గల్లంతు చేసిన మిల్లు యజమాని లక్కం నాగరాజుపై కేసు నమోదు చేసినట్లు ఓఎస్‌డీ ప్రభాకర్ తెలిపారు. ఈ తనిఖీల్లో జిల్లా సివిల్ సప్లై ఆఫీసర్ ఎస్.కృష్ణవేణి, ఏఎస్‌వో జె.రమేష్, టెక్నికల్ అసిస్టెంట్ రవీందర్, కురవి ఆర్ఐ రవి, ఏఎస్సై సదయ్య తదితరులు పాల్గొన్నారు.



రైస్‌మిల్లులో దాడులు నిర్వహిస్తున్న సివిల్ సప్లై టాస్క్‌ఫోర్స్ అధికారులు

ఎవరికీ పట్టని చెక్‌డ్యాంలు

- నెల్లికుదురు మండలంలో 40 డ్యాంల నిర్మాణం
- ఆకేరువాగు, మొండివాగుల్లో కట్టినవి శిథిలం
- పగుళ్లతో నీరు నిలువని దుస్థితి
- మరమ్మతులు చేయాలని రైతుల వినతి

నెల్లికుదురు, సెప్టెంబరు 21 : భూగర్భజలాల నీటిమట్టం పెంచాలనే ఉద్దేశంతో నిర్మించిన చెక్‌డ్యాంలు శిథిలావస్థకు చేరాయి. వాటిని నాసిరకంగా నిర్మించడం, చెక్‌డ్యాంలు కట్టిన చోట ఇసుక తోడడంతో కూలిపోతున్నాయి. వానాకాలంలో వర్షపునీరు నిల్వఉండి, వర్షాలు లేని సమయంలో బావులు, బోరు బావులలో భూగర్భ జలాలు సమృద్ధిగా ఉండాలనే లక్ష్యంతో గత ప్రభుత్వాలు అయా గ్రామాల్లోని మైదాన ప్రాంతాలలో వరద కాలువలకు చెక్‌డ్యాములు నిర్మిం చారు. ఆ చెక్‌డ్యాములు ప్రస్తుతం శిథిలావస్థకు చేరుకున్నాయి. వరద ఉధృతికి కొన్నిచోట్ల చెక్ డ్యాములు కూలిపోయాయి.

మహబూబాబాద్ జిల్లా నెల్లికుదురు మండలంలోని వివిధ గ్రామాల పరిధిలో 40 చెక్‌డ్యాములు నిర్మించారు. రావిరాల, మునిగలవీడు, మదనతుర్తి గ్రామాల రైతులకు నీరునిల్వ ఉండటానికి మొండివాగుపై 4 చెక్ డ్యాములు నిర్మించారు. అవి ఇప్పుడు కూలిపోతున్నాయి. రామన్నగూడెంలో నాలుగు చెక్‌డ్యాములు కట్టగా అవి శిథిలావ్థకు చేరి కూలిపోయే దశకు చేరుకున్నాయి.



రామన్నగూడెం ఆకేరువాగులో చెక్‌డ్యాం కూలి పోవడంతో కొట్టుకపోయిన వ్యవసాయభూములు



బ్రాహ్మణకొత్తపల్లి ఆకేరువాగులో బీటలు ఏర్పడి కూలిన చెక్‌డ్యాం

నెల్లికుదురు పరిధిలో 4 చెక్‌డ్యాములు నిర్మించగా, అవి రైతులకు ఉపయోగకరంగా నిర్మించలేదు. నామమాత్రంగా నిర్మించి, బిల్లులు కాజేశారని రైతులు ఆరోపిస్తున్నారు. శ్రీరామగిరి పరిధిలో 7, ఆలేరు పరిధిలో 6, నర్సింహులగూడెం పరిధిలో 2, మేచరాజుపెల్లి పరిధిలో 4, ఎర్రబెల్లిగూడెం పరిధిలో 3 చెక్కు డ్యాములు పదేళ్ల క్రితం నిర్మించారు. అవి నాసిరకంగా కట్టడంతో బీట లు ఏర్పడి వర్షాకాలంలో నీరువృధా అవుతుంది, వాటికి మరమ్మతులు చేయాలని అయా ప్రాంతాల రైతులు కోరుచున్నారు.

ఆకేరువాగులో కూలిపోతున్న చెక్‌డ్యాంలు

ఆకేరువాగులో నీరునిల్వ ఉండటానికి మేచరాజుపల్లి, ఎర్రబెల్లిగూడెం, నెల్లికుదురు శివారు ఆకేరువాగులో అక్కడక్కడ 5 చెక్‌డ్యాములు నిర్మించారు. ఆ చెక్‌డ్యామ్ లు ఉన్నచోట అక్రమంగా ఇసుక తవ్వకాలు చేపట్టడంతో అవి కూలిపోయే దశకు చేరుకున్నాయి. రామన్నగూడెం ఆకేరు వాగులో గత ప్రభుత్వం రూ.7 కోట్లతో చెక్‌డ్యాం నిర్మించారు. గత ఏడాది ఆకేరువాగు ఉధృతంగా ప్రవ హించడంతో బీటలు ఏర్పడి కూలిపోతుంది. దీంతో ఆకేరువాగు ఒడ్డు రైతుల భూములు కొట్టుపోయి భారీగా నష్టం జరిగింది. నాసిరకం పనులు చేపట్టడంతో ఏడాది గడవకముందే డ్యాం కూలిపోయింది. బ్రాహ్మణకొత్పల్లి శివారు

మిగతా 8వ పేజీలో..

ఆకేరువాగులో చెక్‌డ్యాంలకు మరమ్మతులు చేపట్టాలి

మైస రాములు, రైతు, రామన్నగూడెం



రామన్న గూడెం ఆకేరువాగులో రూ.7కోట్లతో ఏడాది క్రితం నిర్మించిన చెక్‌డ్యాం కూలి పోయింది. దీంతో రైతుల భూములు కొట్టుకపోయాయి. మళ్లీ మరమ్మతు చేయాలి. 20 ఎకరాలు కొట్టుకపోయాయి నష్టపరిహారం చెల్లిం చాలని అధికారులకు దరఖాస్తులు పెట్టుకున్న పట్టికి పరిహారం అందలేదు. ఇప్పటికైనా ప్రభుత్వం రైతులను ఆదుకోవాలి.

రేపు విద్యుత్ పోల్ ఎక్కే పరీక్ష

హనుమకొండ టౌన్, సెప్టెంబర్ 21: జూనియర్ లైన్‌మె న్ నియామకం కోసం సోమవారం ములుగురోడ్డులోని ఉత్తర విద్యుత్ శిక్షణ సంస్థ (ఎన్‌పీటీఐ) పోల్ ఎక్కే పరీక్ష నిర్వహిస్తున్నట్లు హనుమకొండ ఎస్ఈ కె. వెంకటరమణ తెలిపారు. అర్హులైన అభ్యర్థులు ఒరిజినల్ సర్టిఫికెట్స్‌తో ఉదయం 9 గంటల హాజరుకావాలన్నారు. ఎంపిక పూర్తి పారదర్శకంగా ఉంటుందని, ఏలాంటి దళారులను నమ్మి మోసపోవద్దన్నారు.

స్థానిక సంస్థల ఎన్నికల్లో సత్తా చాటాలి..

పీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్

గాంధీ భవనంలో ఉమ్మడి జిల్లా పార్టీ నేతలతో సమావేశం



హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో ఉమ్మడి వరంగల్ జిల్లా నేతలతో సమావేశమైన పీసీసీ చీఫ్ మహేష్‌కుమార్ గౌడ్, తదితరులు

హనుమకొండ, సెప్టెంబరు 21, (ఆంధ్రజ్యోతి): రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో సత్తా చాటాలని పీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్‌గౌడ్ పిలుపు నిచ్చారు. పార్టీలకతీతంగా జరిగే ఈఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ నేతలు, కార్యకర్తలు, మద్దతుదారులు ఎక్కువ మంది ఎన్నికయ్యేలా గ్రామీణస్థాయి నుంచి జిల్లా కేంద్రం వరకు నాయకులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పని చేయాలని కోరారు. శనివారం హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో స్థానిక సంస్థల ఎన్నికలే ప్రధాన ఎజెండాగా ఉమ్మడి వరంగల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ సమావేశం జరిగింది.

ఈ సందర్భంగా పీసీసీ అధ్యక్షుడు ఈ సందర్భంగా మాట్లాడుతూ.. స్థానిక సంస్థల ఎన్నికల్లో విజయంకోసం పార్టీ అనుసరించాల్సిన వ్యూహం, రూపొందించుకోవలసిన కార్యప్రణాళికపై నేతలకు దశదిశా నిర్దేశం చేశారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ కోసం పని చేయనివారికి రాజకీయ భవిష్యత్తు ఉండదని పరోక్షంగా హెచ్చరించారు. ఎమ్మెల్యే అయినా, ఎంపీ అయినా ఎవరైనా స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ గెలుపుకోసం చేసిన కృషి గీటురాయిగా ఉంటుందని, దానిని బట్టే వారికి రాజకీయ భవిష్యత్తు, పార్టీలో సముచిత స్థానం ఉంటుందని స్పష్టం చేశారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత ఎన్నో అభివృద్ధి. సంక్షేమ పథకాలను అమలు చేస్తోందన్నారు. వీటిని ప్రజల్లోకి బలంగా తీసుకువెళ్లడం ద్వారా గ్రామీణ స్థాయిలో పార్టీ బలోపేతానికి ఇప్పటి నుంచే పార్టీ శ్రేణులు కృషి చేయాలని అన్నారు. ఒక పక్క అభివృద్ధిని కొనసాగిస్తూనే గ్రామీణ స్థాయిలో పార్టీని క్రియాశీలకంగా నిలిపే ప్రక్రియ సమాంతరంగా సాగాలని మహేష్‌గౌడ్ పిలుపునిచ్చారు. పార్టీపై నిర్లక్ష్యంగా వ్యవహరించేవారి పట్ల కఠిన చర్యలు ఉంటాయన్నారు. గత లోక్‌సభ ఎన్నికల్లో పార్టీ కోసం ఎవరు కష్టపడి పని చేసింది? ఎవరు పని చేయనిది మొత్తం వివరాల చిట్టా పార్టీ అధిష్ఠానం దగ్గర ఉందని పేర్కొన్నారు. స్థానిక సంస్థ ఎన్నికల్లో విజయానికి గ్రామ స్థాయిలో సమర్థత కలిగిన నేతలను ఇప్పటి నుంచే గుర్తించాలని మహేష్‌కుమార్ ఆదేశించారు.

కాగా, ఇప్పుడున్న కమిటీలన్నిటినీ రద్దు చేయడంతో పాటు కొత్త కమిటీలను సమర్థులైనవారితో నియమించాలన్న అభిప్రాయం సమావేశంలో వ్యక్తమైంది. ఈ కమిటీల ఏర్పాటులో మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలను కూడా భాగస్వామ్యం చేయాలన్న నిర్ణయాన్ని తీసుకున్నట్టు తెలిసింది. లోకల్ బాడీ ఎన్నికలు దగ్గరపడుతున్నందున అభ్యర్థులను నిలబెట్టడానికి ఇప్పటి నుంచే కసరత్తు మొదలు పెట్టాలని ఎమ్మెల్యేలను పార్టీ అధ్యక్షుడు ఆదే శించారు. ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలు పార్టీ గుర్తుమీద జరుగుతున్నప్పటికీ సర్పంచ్, వార్డు సభ్యుల పదవులకు ఎన్నికలు మాత్రం పార్టీలతో సంబంధం లేకుండా జరుగనున్నందువల్ల ఎమ్మెల్యేలు తమ నియోజకవర్గం పరిధిలోని అన్ని గ్రామ పంచాయతీల్లో పార్టీ నైతిక మద్దతుతో గెలిచే అవకాశం స్థానిక నాయకులను ఎంపిక చేయడంపై దృష్టి సారించాలని సమావేశం సూచించింది. గత ఎన్నికల్లో మెజారిటీ స్థానిక సంస్థలను బీఆర్ఎస్ గెలుచుకున్న నేపథ్యంలో ఈ సారి ఆ పార్టీకి ఏ మాత్రం అవకాశం ఇవ్వకుండా సమగ్రమైన కార్యప్రణాళికను రూపొందించుకొని ప్రతిపక్ష పార్టీలకన్నా ఒకింత ముందుండాలని సమావేశం పిలుపు నిచ్చింది. ఉమ్మడి వరంగల్ జిల్లాలో ఉన్న మొత్తం 1,688 గ్రామ పంచాయతీల్లో దాదాపు అన్నిటినీ కైవసం చేసుకునేలా సమష్టిగా కృషి చేయాలని పార్టీ వ్యవహారాల ఇన్‌చార్జి దీపాదాస్ మున్షీ పిలుపునిచ్చారు. మంత్రి కొండా సురేఖ ఉమ్మడి జిల్లాలో పార్టీ పరిస్థితి, గ్రామీణ స్థాయిలో స్థానిక సంస్థల ఎన్నికలను ఎదుర్కొనేందుకు భవిష్యత్తులో కానున్న సన్నద్ధతను వివరించారు. స్థానిక ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థులను గెలిపించుకోవడం, ప్రభుత్వ పథకాలను విస్తృతంగా ప్రజల్లోకి తీసుకువెళ్లడం, వివిధ స్థాయిలో పార్టీ నేతల మధ్య సమన్వయం సాధించడం ద్వారా స్థానిక ఎన్నికల్లో ఘన విజయం సాధించగలమన్న విశ్వాసాన్ని జిల్లా ఇన్‌చార్జి మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి వ్యక్తం చేశారు. ఈసమావేశంలో ఏఐసీసీ పక్షాన విశ్వనాథ్, విష్ణునాథ్‌తో పాటు ఎమ్మెల్యేలు నాయిని రాజేందర్‌రెడ్డి, దొంతి మాధవరెడ్డి, రేవూరి ప్రకాశ్‌రెడ్డి, గండ్ర సత్యనా రాయణ రావు, రాంచంద్ర నాయక్, కేఆర్ నాగరాజు, అశ్వినీరెడ్డి, కడియం శ్రీహరి., ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య, వరంగల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షు రాలు ఎర్రబెల్లి స్వర్ణ, ఎంపీలు కడియం కావ్య, బలరాం నాయక్, ఉమ్మడి వరంగల్ జిల్లాకు చెందిన సీనియర్ కాంగ్రెస్ నాయకులు, వివిధ కార్పొరేషన్ల చైర్మన్లు పాల్గొన్నారు.

రైళ్ల ట్రాఫిక్‌కు ఇక చెక్

ముగిసిన మూడో రైల్వేలైన్ నిర్మాణ పనుల ● వారంలో అందుబాటులోకి.. త్వరలో ట్రయల్ రన్



సొరంగమార్గం ట్రాక్‌వద్ద రిబ్బన్ కట్‌చేస్తున్న సేఫ్టీ ఆఫీసర్ మాధవి

కాజీపేట, సెప్టెంబరు 21: కాజీపేట - హసన్‌పర్తి - వరంగల్ మధ్య మూడో రైల్వే లైన్ నిర్మాణం పూర్తయింది. ఇక నుంచి ఢిల్లీ నుంచి వరంగల్ మీదుగా చెన్నై, ఢిల్లీ నుంచి కాజీపేట మీదుగా సికింద్రాబాద్‌కు వెళ్లే రైళ్ల ట్రాఫిక్‌కు తెర పడనుంది. హసన్‌పర్తి నుంచి వరంగల్, హసన్‌పర్తి నుంచి కాజీపేట వరకు అదనంగా మూడో రైల్వే లైన్ నిర్మాణం పూర్తయ్యింది. 2021లో ప్రారంభమైన ఈ ట్రాక్ నిర్మాణం.. హసన్‌పర్తి నుంచి వరంగల్ వరకు 21 కిలోమీటర్ల, హసన్‌పర్తి నుంచి కాజీపేట వరకు 10 కిలోమీటర్ల మేర ట్రాక్‌నిర్మాణం చేశారు దీంతో బల్లార్ష నుంచి వరంగల్ వైపు, బల్లార్షా నుంచి కాజీపేట మీదుగా సికింద్రాబాద్ వెళ్లే రైళ్లకు ఎలాంటి అంతరాయం లేకుండా రాకపోకలు సాఫీగా జరుగనున్నాయి. గతంలో న్యూఢిల్లీ నుంచి వరంగల్ వైపు రైలు వెళ్లాలంటే అదే లైన్‌లో కాజీపేట వైపు వెళ్లే రైలును ఆపి వరంగల్ వైపు వెళ్లే రైళ్లను పంపించేవారు. కాజీపేట వైపు రైళ్లను పంపించాలంటే వరంగల్ వైపు వెళ్లే రైలును ఆపాల్సిన పరిస్థితి. దీంతో ప్రతీరోజు గూడ్స్ రైళ్లతో కలిపి సుమారు 150 రైళ్ల రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు కలగడమే కాకుండా రైల్వేకు అపారమైన నష్టం జరిగేది. ప్రస్తుతం కాజీపేట వైపు అదనంగా మరో ట్రాక్, వరంగల్ వైపు అదనంగా మరో ట్రాక్ నిర్మించడంతో మొత్తంగా ఈ రూట్‌లలో నాలుగు రైల్వే లైన్‌లు ఏర్పడ్డాయి. కొత్తగా నిర్మించిన ట్రాక్‌లను రైల్వే సేఫ్టీ అధికారి మాధవి పరిశీలన పూర్తయ్యింది. మరో రెండు రోజుల్లో కొత్త ట్రాక్‌లపై ట్రయల్ రన్ చేపట్టనున్నారు. అనంతరం ఈ ట్రాక్‌ల మీదుగా పూర్తిస్థాయి రైళ్లను నడపనున్నారు.

ఇదే రూట్‌లో సొరంగ మార్గం

కాజీపేట - హసన్‌పర్తి రైల్వేస్టేషన్‌ల మధ్య రైల్ అండర్ బ్రిడ్జి (సొరంగ మార్గం) నిర్మాణం ప్రత్యేకం కానుంది. రైళ్ల రాకపోకలకు అంతరాయం కలుగకుండా ఈ సొరంగ మార్గంలో సుమారు 340 మీటర్ల బ్రిడ్జిని నిర్మించారు. ఈ బ్రిడ్జి మీదుగా ఒకేసారి రెండు రైళ్లు, బ్రిడ్జి కింద నుంచి మరో రైలు రాకపోకలు సాగించనున్నాయి. ఈనెల 19 నుంచి మూడురోజుల పాటు ఈ రైలు మార్గాలను రైల్వే సేఫ్టీ కమిషనర్ మాధవి బృందం పర్యవేక్షించింది. మూడో రైల్వే లైన్‌లు, సొరంగమార్గం ట్రాక్ నిర్మాణంపై ఆమె పూర్తి స్థాయి సంతృప్తి వ్యక్తం చేసినట్లు తెలుస్తోంది. ఇలాంటి సొరంగమార్గ నిర్మాణాలు మరిన్ని చేపట్టడానికి రైల్వే అధికారులు చర్యలు తీసుకోనున్నట్లు తెలుస్తోంది. శుక్రవారం సేఫ్టీ కమిషనర్ మాధవి బృందం రిబ్బన్ కట్‌చేసి కొబ్బరికాయలు కొట్టి, బ్రహ్మణుల వేదమంత్రాల నడుమ ప్రత్యేక పూజలు కూడా చేశారు. ప్రయోగాత్మకంగా నిర్మించిన ఈ ట్రాక్‌లు ఎలాంటి ఇబ్బందులు జరుగకుండా ఉండాలని విజయవంతం కావాలని ఆమె కోరుకున్నట్లు తెలిసింది. ఆమె ఫిట్‌నెస్ సర్టిఫికెట్ ఇస్తే వెంటనే ట్రయల్ రన్‌చేసి వారం రోజుల్లో ఈ ట్రాక్ మీదుగా పూర్తిస్థాయి రైళ్లను నడపడానికి రైల్వే అధికారులు అన్ని చర్యలు తీసుకున్నారు.

బొడ్డెమ్మ బొడ్డెమ్మా.. కోల్..

● ఆడబిడ్డల పండుగ బొడ్డెమ్మ వేడుకలకు సిద్ధమైన పల్లెలు ● రేపటి నుంచి సాగనున్న సంబురం ● తొమ్మిది రోజుల పాటు సందడే సందడి

వరంగల్ కల్చరల్, సెప్టెంబరు 21: తెలంగాణ పల్లెల్లో ప్రాచీన సంస్కృతి సంప్రదాయాలకు పెద్దపీట వేస్తూ యువతులు, చిన్నారులు యేటా జరుపుకొనే బొడ్డెమ్మ పండుగ సోమవారం నుంచి ప్రారంభం కానుంది. కుంటున్నారు. నేటి కంప్యూటర్ కాలంలో కూడా బొడ్డెమ్మను తెలంగాణ ప్రాంతంలో జరుపుకోవడం మన సంస్కృతికి నిదర్శనం. రాష్ట్రం ఏర్పాటైనప్పటి నుంచి అనేక సంస్కృతి సంప్రదాయాలను కొనసాగించగా ప్రాచీన పండుగగా మొదలయ్యే నాలుగు పండుగల్లో మొట్టమొదటి పండుగ బొడ్డెమ్మ. రాష్ట్ర ప్రభుత్వం గుర్తించకపోవడంతో పాటు ప్రోత్సహించకపోవడం వలన భావితరాల వారికి బొడ్డెమ్మ పండుగ తెలియకుండానే కనుమరుగు కానుంది. అయినా నేటికి సంస్కృతి సంప్రదాయబద్ధమైన బొడ్డెమ్మ పండుగను పల్లె, పట్టణ ప్రాంతాలు, నగరాల్లో ఆచరించుకుంటున్నారు. తొమ్మిది రోజుల పాటు కొనసాగే బొడ్డెమ్మ వేడుకలు మరి కొద్ది గంటల్లో ప్రారంభం కానున్నాయి.

బొడ్డెమ్మ ఎలా ఉంటుంది..?

బొడ్డెమ్మ అనే పదాన్ని అమ్మవారి నామాలలో ఒక నామంగా గుర్తించి బొడ్డెమ్మను పుట్టమన్నుతో తయారు చేస్తారు. ప్రజలు కాలుపెట్టని ప్రాంతానికి చెందిన మట్టి పుట్ట కాబట్టి పుట్ట మన్నును తెచ్చి పీటపై శ్రీచక్ర రూపంలో సహప్రాకారంగా గడులతో తయారుచేసి కింది నుంచి వెడల్పు, మీదికి కలశ రూపంలో సన్నగా తయారు చేస్తారు. ఒక ఆకారం తీసుకొచ్చి బొడ్డెమ్మగా రూపు దిద్దుతారు.

పూజా విధానం

ప్రకృతి సిద్ధమైన పుట్టమన్నుతో తయారు చేసిన బొడ్డెమ్మను ఎర్రమన్నుతో అందంగా అలికి చుట్టూరా పిండితో ముగ్గులు వేసి పసుపు బొట్లు, కుంకుమ బొట్లు పెట్టి పూలతో అలంకరిస్తారు. పైన రాగి చెంబును కలశంగా ఏర్పాటు చేసి కింద బొడ్డెమ్మ ముందు మట్టి ప్రమిద దీపాన్ని పెట్టి అగరబతుఉతలు ముట్టించి చిన్నారులు ఆట పాటలతో కీర్తిస్తూ పూజలు నిర్వహిస్తారు.



బొడ్డెమ్మ



బొడ్డెమ్మ ఆడుతున్న మహిళలు, చిన్నారులు (ఫైల్)

ఇంటింటి నుంచి బియ్యం

ప్రతీరోజు సాయంత్రం ఇంటి నుంచి చిన్నారులు ఆట పాటలు నిర్వహించుకోవడానికి బొడ్డెమ్మ వద్దకు బియ్యం, అటుకులు, చక్కర, బెల్లం తెస్తారు. తాము తెచ్చిన బియ్యాన్ని కలశంలో పోసి బొడ్డెమ్మ ఆట పాట నిర్వహించుకున్న అనంతరం అటుకులు, చక్కరను అందరికి ప్రసాదంగా పంచుతారు. తొమ్మిది రోజుల పాటు ఆట పాటలు నిర్వహించుకుంటారు.

ఆఖరి రోజు నిమజ్జనం

తొమ్మిదిరోజులపాటు ఆట పాటలతో బొడ్డెమ్మను భక్తి శ్రద్ధలతో అలంకరించి పూజించి తాము తెచ్చిన బియ్యం, బెల్లాన్ని ఆఖరిరోజు చపాతీ(రొట్టె)లు బెల్లంతో కలిపి లడ్డూలు తయారు చేసి అందరికి ప్రసాదంగా ఇస్తారు. ఆట పాటల అనంతరం వెళ్లి రావమ్మా.. బొడ్డెమ్మా అంటూ.. చెరువులు, కుంటలు, బావుల్లో బొడ్డెమ్మను నిమజ్జనం చేస్తారు.

కనుమరుగు కానున్న బొడ్డెమ్మ

ప్రాచీన పండుగల్లో ఒకటిగా ఉన్న పండుగ బొడ్డెమ్మ. తెలంగాణ ఏర్పాటు అనంతరం పండుగను గుర్తించిన ప్రభుత్వం.. సంప్రదాయమైన బొడ్డెమ్మను మాత్రం గుర్తించకపోవడం శోచనీయం. తరతరాల నుంచి పల్లె, పట్టణ ప్రాంతాల్లో, నగరాల్లో నేటికి నిర్వహించుకుంటున్న ఈ పండుగను గుర్తించకపోవడంతో కనుమరుగు కానుంది. భావితరాల వారికి తెలంగాణ సంస్కృతి పండుగలను అందించాల్సిన అవసరం ప్రభుత్వంపై ఉంది. స్వచ్ఛంద సంస్థలు కూడా అనేక సంప్రదాయ పండుగలను గుర్తించి వేడుకలు నిర్వహించినా బొడ్డెమ్మను కూడా స్వచ్ఛంద సంస్థలు, ధార్మిక సంస్థలు గుర్తించకపోవడం నిరాశకు గురిచేస్తోందని పలువురు మహిళలు పేర్కొంటున్నారు.

ఎగ్ బోర్డు ఏర్పాటుకు కృషి చేస్తా..

● కోళ్ల వ్యాధుల నివారణకు త్వరలో వ్యాక్సిన్ ● కేంద్ర సహాయ మంత్రి జార్జ్ కురియన్



సమావేశంలో మాట్లాడుతున్న కేంద్ర సహాయ మంత్రి జార్జి కురియన్

హనుమకొండ చౌరస్తా, సెప్టెంబరు 21: ఆలిండియా ఎగ్‌బోర్డు ఏర్పాటు కోసం కృషి చేస్తానని కేంద్ర పశుసంవర్ధక, పాడి పరిశ్రమల శాఖ సహాయ మంత్రి జార్జ్ కురియన్ అన్నారు. శనివారం హనుమకొండ అశోకా కన్వెన్షన్ హాల్‌లో వరంగల్ జిల్లా పౌల్ట్రీ ఫార్మర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమావేశానికి కేంద్ర సహాయ మంత్రి జార్జ్ కురియన్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. కోళ్ల వ్యాధులు నివారణకు వ్యాక్సిన్ తయారు చేయడం చివరి దశకు వచ్చిందని, త్వరలోనే అందుబాటులోకి తీసుకువస్తామన్నారు. కేంద్ర ప్రభుత్వం పౌల్ట్రీ పరిశ్రమల నిర్వాహకులకు అండగా ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తోందన్నారు. ఐఎల్‌టీ, హెచ్‌పీ కారణంగా దేశవ్యాప్తంగా పౌల్ట్రీ ఫామ్స్ మూసివేస్తున్నారని, ఇప్పటికే కేరళ రాష్ట్రంలో సుమారు 14 పరిశ్రమలు మూసివేశారని గుర్తు చేశారు. కేంద్రం ప్రభుత్వం 109 రకాల గడ్డిని పెంచుకోవడానికి అనుమతి ఇచ్చే విధంగా కృషి చేస్తానన్నారు.

వరంగల్ జిల్లా పౌల్ట్రీ ఫార్మర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే మార్తినేని ధర్మారావు మాట్లాడుతూ.. కరోనా కారణంగా పౌల్ట్రీ పరిశ్రమలు నష్టాల్లో కూరుకుపోయాయన్నారు. దేశంలో ఇప్పటికే చాలా వరకు పౌల్ట్రీ ఫామ్‌లు మూసివేస్తున్నారన్నారు. దేశంలోనే తెలంగాణ రాష్ట్రం గుడ్ల విక్రయాల్లో మొదటిస్థానంలో ఉండగా, రాజస్థాన్ చివరి వరుసలో ఉందన్నారు. అనంతరం పౌల్ట్రీ ఫార్మర్స్ పలు సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని కేంద్ర సహాయ మంత్రికి అందజేశారు. ఈ సమావేశంలో నేషనల్ ఎగ్ కో ఆర్డినేషన్ కమిటీ జోనల్ చైర్మన్ ఎర్రబెల్లి ప్రదీప్‌రావు, వరంగల్ జిల్లా పౌల్ట్రీ ఫార్మర్స్ అసోసియేసన్ ప్రధాన కార్యదర్శి సీహెచ్. ప్రభాకర్‌రెడ్డి, కోశాధికారి ఎం.రాంప్రసాద్, ఉపాధ్యక్షుడు జి.రమణారెడ్డి, సీహెచ్. రవీందర్, శ్రీరాంనాయక్, ఎం.సుబ్బారావు, టి.శ్యాంసుందర్‌రావు తదితరులు పాల్గొన్నారు.



ప్రెస్‌క్లబ్‌లో మాట్లాడుతున్న డైరెక్టర్ శ్రీనివాస్, హీరో చంద్రహాస్

'రాంనగర్ బన్నీ' సినిమాను ఆదరించండి..

మీడియా సమావేశంలో సినిమా దర్శకుడు శ్రీనివాస్ విజ్ఞప్తి

వడ్డెపల్లి, సెప్టెంబరు 21: బుల్లితెర నటుడు ప్రభాకర్ తనయుడు చంద్రహాస్ హీరోగా పరిచయం అవుతున్న రాంనగర్ బన్నీ చిత్రాన్ని సమాజంలోని ప్రతీ ఒక్కరు ఆదరించాలని సినీ డైరెక్టర్ శ్రీనివాస్ కోరారు. శనివారం హనుమకొండ బాలసముద్రంలోని ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయనతో పాటు హీరో చంద్రహాస్ మాట్లాడారు. ఈ సినిమా ప్రతీ ఒక్కరు చూసి ఎంజాయ్ చేసేలా ఉంటుందని అన్నారు. కామెడీ, సాంగ్స్, ఫైట్స్ అందరికీ నచ్చే విధంగా ఉంటాయని స్పష్టం చేశారు. ఈ సినిమా వసూళ్లలో 10శాతం వరద బాధితుల సహాయార్థం రెండు తెలుగు రాష్ట్రాల సీఎం రిలీఫ్ ఫండ్స్‌కు ఇవ్వాలని నిర్ణయించినట్లు చెప్పారు. తెలుగు ప్రజలు అందరు ఆదరిస్తే ఈ సినిమా విజయవంతం అవుతుందని కోరారు. ఈ సినిమా అక్టోబరు 4న విడుదలవుతుందని తెలిపారు. ఈ సమావేశంలో బుల్లితెర నటుడు ప్రభాకర్, హీరోయిన్లు విస్మయశ్రీ, రిచాజోషి తదితరులు పాల్గొన్నారు.

నేడు పొలిటికల్ సైన్స్ అలూమ్నీ మీట్



ఏర్పాట్లు పరిశీలిస్తున్న దృశ్యం

కేయూ క్యాంపస్, సెప్టెంబరు 21: కాకతీయ యూనివర్సిటీ పొలిటికల్ సైన్స్ పూర్వ విద్యార్థుల సమ్మేళనం 'ది గ్రేట్ రీ యూనియన్' పేరుతో ఆదివారం నిర్వహిస్తున్నట్లు కేయూ పొలిటికల్ సైన్స్ విభాగాధిపతి డాక్టర్ సంకినేని వెంకట్, సీనియర్ ప్రొఫెసర్ వల్లూరి రామచంద్రం శనివారం తెలిపారు ఈ సందర్భంగా విభాగాధిపతి డాక్టర్ సంకినేని వెంకట్ మాట్లాడుతూ.. సెప్టెంబరు 22న ఆదివారం ఉదయం 10.30 గంటలకు కేయూ క్యాంపస్‌లోని పొలిటికల్‌సైన్స్ విభాగంలో పూర్వ విద్యార్థుల సమ్మేళనం జరుగుతోందని చెప్పారు. రాష్ట్ర గ్రంథాలయం సంస్థ చైర్మన్, పొలిటికల్ సైన్స్ విభాగం పూర్వ విద్యార్థి డాక్టర్ మహ్మద్ రియాజ్, పొలిటికల్‌సైన్స్ విభాగం రిటైర్డు ప్రొఫెసర్లు రమరాంరెడ్డి, సమ్మాలాల్, సంజీవరెడ్డి, వీరన్న, హరిప్రసాద్, దినేశ్‌కుమార్‌లతో పాటు పొలిటికల్‌సైన్స్ విభాగం బీవోఎస్ చైర్మన్ డాక్టర్ కృష్ణయ్య, అధ్యాపకులు డాక్టర్ సత్యనారాయణ, డాక్టర్ వడ్డెపల్లి నాగరాజు, డాక్టర్ లక్ష్మీనారాయణ, డాక్టర్ విజయ్‌కుమార్ తదితరులు హాజరుకానున్నారు. పూర్వ విద్యార్థులందరూ హాజరుకావాలని కోరారు.

క్యాంపస్‌లో ప్రత్యేక ఏర్పాట్లు

కేయూ క్యాంపస్‌లోని రాజనీతిశాస్త్రవిభాగంలో ఆదివారం జరిగే పూర్వ విద్యార్థుల సమ్మేళనం కోసం ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. కేయూ క్యాంపస్‌లోని హ్యూమనిటీస్ బిల్డింగ్‌ను సర్వాంగసుందరంగా అలంకరించారు ప్రత్యేక ఆహ్వాన ఫ్లెక్సీలు, బ్యానర్లు ఏర్పాటు చేశారు. అధ్యాపకులు, విద్యార్థులు ఏర్పాట్లలో నిమగ్నమయ్యారు. రాష్ట్ర వ్యాప్తంగా అనేక జిల్లాల్లో పొలిటికల్ సైన్స్ పూర్వ విద్యార్థులు హాజరుకానున్నారు. ప్రధానంగా ఉమ్మడి వరంగల్, ఖమ్మం, కరీంనగర్, ఆదిలాబాద్, నిజామాబాద్, మెదక్, నల్గొండ, మహబూబ్‌నగర్ జిల్లాల నుంచి పెద్దఎత్తున పూర్వ విద్యార్థులు పాల్గొంటారు.

రైలు ప్రమాదంలో యువకుడికి గాయాలు



గాయపడిన శశిధర్

హసన్‌పర్తి, సెప్టెంబరు 21: రైలు ప్రమాదంలో యువకుడికి తీవ్ర గాయాలైన ఘటన ఎల్లాపూర్ రైల్వేస్టేషన్‌లో శనివారం చోటు చేసుకుంది. రైల్వే పోలీసుల కథనం ప్రకా రం.. కుమ్రంభీం జిల్లా బెజ్జూరు మండల కేంద్రానికి చెంది న కొల్లంపాక శశిధర్ శనివారం ఉదయం ఇంటర్ సిటీ ఎక్స్‌ప్రెస్‌లో హసన్‌పర్తికి వస్తున్నాడు. ఈ క్రమంలో హస న్‌పర్తి మండల ఎల్లాపూర్ రైల్వే స్టేషన్‌లో నెమ్మదిగా వెళ తున్న ఇంటర్ సిటీ ఎక్స్‌ప్రెస్ రైలు దిగుతుండగా కిందపడ గా తలకు బలమైన గాయాలయ్యాయి. దీంతో రక్తస్రావం కావడంతో స్థానికులు 108కు సమాచారం అందించారు. వెంటనే 108 సిబ్బంది బాధితుడిని ప్రథమ చికిత్స అందించి ఎంజీఎంకు తరలించారు. అక్కడ పరిస్థితి విషమించడంతో ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చేర్పించినట్లు బాధితుడి బంధువు హసన్‌పర్తికి చెందిన కార్పొరేటర్ గురుమూర్తి శివకుమార్ తెలిపారు. ప్రస్తుతం అతడి పరిస్థితి విషమంగా ఉందని వైద్యులు తెలిపారు.

కేయూ డిగ్రీ 1, 3, 5 సెమిస్టర్ ఫీజు గడువు 26

కేయూ క్యాంపస్, సెప్టెంబరు 21: కాకతీయ యూనివర్సిటీ పరిధిలోని డిగ్రీ కళాశాలల్లో చదువుతున్న బీఏ, బీకాం, బీఎస్సీతోపాటు ఇతర కోర్సుల 1, 3, 5 సెమిస్టర్‌ల పరీక్షల ఫీజులను సెప్టెంబరు 26 వరకు ఎలాంటి అపరాధ రుసుము లేకుండా చెల్లించుకోవాలని కేయూ పరీక్షల నియంత్రణాధికారి ప్రొఫెసర్ శ్రీరామోజు నరసింహాచారి, అదనపు పరీక్షల నియంత్రణాధికారి డాక్టర్ తిరుమలదేవి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. రూ.50 అపరాధ రుసుంతో అక్టోబరు 5వ తేదీ వరకు ఫీజులు చెల్లించుకోవాలని కోరారు. ఇతర వివరాలకు వర్సిటీ వెబ్‌సైట్‌లో చూడాలన్నారు.

గొర్రెల కాపరి మృతదేహం లభ్యం

ఐనవోలు, సెప్టెంబరు 21: గొర్రెల కాపరి మృతదేహం లభ్యమైన సంఘటన కక్కిరాలపల్లి గ్రామంలో వెలుగుచూసింది. కుటుంబసభ్యులు, పోలీసుల కథనం ప్రకారం కక్కిరాలపల్లికి చెందిన పిట్టల రాజు (26) అనే యువకుడు గొర్రెల కాపరిగా పనిచేస్తున్నాడు. మూడు రోజుల కిందట గొర్రెలను తోలుకపోయిన రాజు.. సాయంత్రం ఇంటికి రాలేదు. తల్లిదండ్రులు గాలించిన ఆచూకీ లభించ లేదు. గ్రామంలోని ఒక పాత ఇంటి నుంచి దుర్వాసన వస్తుందని భావించి ఇరుగు పొరుగు వారు వెళ్లి చూశారు. రాజు అప్పటికే మృతిచెంది ఉన్నాడు. పోలీసులకు సమాచారం ఇవ్వగా కుళ్లిపోయిన మృతదేహాన్ని మార్చురీకి తరలించారు. మృతుడికి మద్యం తాగే అలవాటు ఉందని మద్యం సేవించాక తాగడానికి నీళ్ల లభించక మృతిచెందినట్లు భావిస్తున్నారు. తన కుమారుడి మృతిపై ఎలాంటి అనుమానం లేదని తండ్రి స్వామి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. పోస్టుమార్టం నివేదిక వచ్చాక మృతికిగల కారణాలు తెలుస్తాయని ఎస్సై తెలిపారు. కాగా, మృతుడు అవివాహితుడు.

'విద్యార్థుల పట్ల తల్లిదండ్రులు అప్రమత్తంగా ఉండాలి'

దంతాలపల్లి, సెప్టెంబరు 21 : ప్రభుత్వ పాఠశాలలో చదివే విద్యార్థుల తల్లిదండ్రులు అప్రమత్తంగా ఉండి, బడికి పంపాలని ప్రధానోపాధ్యాయుడు ధరావత్ కిషన్ నాయక్ కోరారు. శనివారం పెద్దముప్పారం ప్రాథమిక పాఠశాల విద్యార్థుల తల్లిదండ్రులతో ఉపాధ్యాయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బడి నుంచి ఇంటికి రాగానే విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ కనబర్చాలన్నారు. నేటి బాలలే రేపటి పౌరులన్నారు. ఈ కార్యక్రమంలో అమ్మ ఆదర్శ పాఠశాల చైర్మన్ లక్ష్మీ, ఉపాధ్యాయులు ఎండీ యాకూబ్, రమేష్, ఆంజనేయులు, మల్లికార్జున్, నగేష్ తదితరులు పాల్గొన్నారు.

ఒకరిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు

మహబూబాబాద్ రూరల్, సెప్టెంబరు 21 : జిల్లా కేంద్రం శివారు మిల్ట్రీకాలనీకి చెందిన పిడుగు శ్రీనుపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసినట్లు టౌన్ సీఐ పెండ్యాల దేవేందర్ శనివారం తెలిపారు. సీఐ తెలిపిన వివరాల ప్రకారం. నూనావత్ వంశీ ఇదే కాలనీలోని పిడుగు శ్రీను ఇంటి ఎదుట వినాయక విగ్రహాన్ని ఏర్పాటు చేశాడు. దీంతో పిడుగు శ్రీను తన ఇంటి ముందు విగ్రహం ఎందుకు పెట్టావని వంశీని కులం పేరుతో దూషించడంతో పాటు దాడి చేశాడని పేర్కొన్నారు. బాధితుడు వంశీ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పిడుగు శ్రీనుపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

యూట్యూబర్ రఘుకు ఎస్పీ ప్రశంసా



యూట్యూబర్ రఘును అభినందిస్తున్న ఎస్పీ సుధీర్ రామ్‌నాథ్ కేకన్

కురవి, సెప్టెంబరు 21 : సామాజిక కార్యక్రమాలతో ఆపదలో, పేదరికంలో ఉన్న పలువురికి ఉపయోగపడుతున్న కురవికి చెందిన గంగరబోయిన రఘును ఎస్పీ సుధీర్‌రామ్‌నాథ్ కేకన్ అభినందించారు. శనివారం రఘును ఎస్పీ తన కార్యాలయానికి పిలిచి సత్కరించారు. గత కొంతకాలంగా రఘు ఎంతో మందికి సహాయం చేస్తున్నాడని, నర్సింహులపేటకు చెందిన చిన్నారులకు రూ.21లక్షలు సమకూర్చడం గొప్ప విషయమన్నారు. యువత రఘును చూసి ఇతరులకు సాయం చేసే గుణాన్ని అలవర్చుకోవాలన్నారు. మహబూబాబాద్ రూరల్ సీఐ సర్వయ్య, ఎస్సై సతీష్, ఐజేయూ జిల్లా అధ్యక్షులు సీహెచ్.శ్రీనివాస్, దుడ్డెల వినోద్ పాల్గొన్నారు.

మామిడి కలప పట్టివేత

తొర్రూరు రూరల్, సెప్టెంబరు 21 : మడిపల్లి గ్రామశివారు నుంచి అక్రమంగా మామిడి కలపను తరలిస్తున్న డీసీఎంను శనివారం రాత్రి పట్టుకున్నట్లు డీఆర్‌వో సక్రం తెలిపారు. రేంజ్‌ఆఫీసర్ రేణుక ఆధ్వర్యంలో అటవిశాఖ అధికారులు తనిఖీలు చేపట్టగా డీసీఎంలో అక్రమంగా వెళ్తున్న 12 టన్నుల మామిడి దుంగలను స్వాధీనం చేసుకొని డీసీఎం సీజ్‌చేసి, డ్రైవర్ సుభాన్‌ను కేసు నమోదు చేశారు. ఈ తనిఖీల్లో బీట్ ఆఫీసర్ కొట్టం జనార్ధన్, సిబ్బంది పాల్గొన్నారు.

జగన్, సుబ్బారెడ్డిపై ఠాణాలో ఫిర్యాదు



ఠాణాలో ఫిర్యాదు చేస్తున్న వేంకటేశ్వరస్వామి భక్తులు

కేసముద్రం, సెప్టెంబరు 21 :తిరుపతి లడ్డు తయారీలో కల్తీకి పాల్పడి కోట్లాది మంది భక్తుల మనోభావాలు దెబ్బతీసిన ఏపీ మాజీ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి, టీటీడీ మాజీ చైర్మన్ వైవీ. సుబ్బారెడ్డి, అప్పటి అధికారులపై చర్యలు తీసుకోవాలని కేసముద్రం పోలీస్‌స్టేషన్‌లో శనివారం వేంకటేశ్వర స్వామి భక్తులు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా పలువురు భక్తులు మాట్లాడుతూ లడ్డు తయారీలో ఉపయోగించిన నెయ్యిలో జంతువుల కొవ్వు కలిసిందని ఎన్‌డీడీబీ నివేదిక ఇచ్చిందని తెలిపారు. జగన్ అధికారంలో ఉన్న కాలంలో కుట్రపూరితంగా ఉద్దేశపూర్వకంగా తిరుపతికి అపఖ్యాతి తీసుకువచ్చే చర్యలకు పాల్పడ్డారని ఆరోపించారు. కోట్లాది భక్తుల మనోభావాలను దెబ్బతీసి, మోసం చేసిన జగన్ తదితరులపై చర్యలు తీసుకోవాలని కోరారు. వేలం శ్రీనివాస్, పొదిల నర్సింహారెడ్డి, తుంపిళ్ల శ్రీనివాస్, చింత నాగేశ్వర్‌రావు, కరుణాకర్, మంచెన శ్రీనివాస్, ఉప్పునూతల రమేష్, సింగంశెట్టి మధుకర్, శ్రీరాం చంద్రన్‌కుమార్, కంచు సురేందర్, గాంతి వెంకట్‌రెడ్డి, మచ్చిక అశోక్, శ్రీరాం అశోక్ పాల్గొన్నారు.

ఐకేపీ సిబ్బంది పారదర్శకంగా పనిచేయాలి

- ఆర్డీవో మధుసూదన్ రాజు

గూడూరు, సెప్టెంబరు21 : ఇందిరక్రాంతి పథకం(ఐకేపీ)లో పనిచేస్తున్న సిబ్బంది పారదర్శకంగా విధులు నిర్వహించాలని మహబూబాబాద్ ఆర్డీవో మధుసూదన్‌రాజు అన్నారు. గూడూరు ఎంపీడీవో కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆర్డీవో మాట్లాడుతూ పెండింగ్‌లో ఉన్న పనులను పూర్తి చేయాలని సూచించారు. పనుల్లో పారదర్శకత పాటిస్తూ విధులు నిర్వహించాలన్నారు. ఈ సమావేశంలో ఎంపీడీవో వీరస్వామి, ఎంపీవో సత్యనారాయణ, ఈసీ భస్సీలాల్, ఏపీఎం రవీందర్, ఐకేపీ సిబ్బంది, ఫీల్డ్ అసిస్టెంట్‌లు పాల్గొన్నారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి

- అదనపు కలెక్టర్ లెనిన్ వత్సల్ టొప్పొ



ఎస్సీ బాలికల వసతి గృహాన్ని తనిఖీ చేస్తున్న లెనిన్ వత్సల్ టొప్పొ

గూడూరు, సెప్టెంబరు 21 : వసతి గృహాల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని జిల్లా అదనపు కలెక్టర్ లెనిన్ వత్సల్ టొప్పొ అన్నారు. గూడూరులోని బీసీ బాలుర, ఎస్సీ బాలికల వసతి గృహాలను శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. వసతి గృహాల్లోని మరుగుదొడ్లు, మూత్రశాలలు, వంటగది, గదులను పరిశీలించారు. అనంతరం విద్యార్థులతో మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యార్థులు క్రమశిక్షణతో చదువుకుని మంచి ఫలితాలు సాధించాలన్నారు. వసతి గృహాల పరిసరాలను ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉండేలా వార్డెన్‌లు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఎంపీడీవో వీరస్వామి, పంచాయతీ కార్యదర్శి భీమానాయక్, మాజీ సర్పంచ్ నూనావత్ రమేష్‌నాయక్ పాల్గొన్నారు.

టీపీటీఎఫ్ మండల కమిటీ ఎన్నిక



సురేందర్, నర్సింహారాజు

కేసముద్రం, సెప్టెంబరు 21 : తెలంగాణ ప్రొగ్రెసివ్ టీచర్స్ ఫెడరేషన్(టీపీటీఎఫ్) మండల కమిటీని స్థానిక జడ్పీ హైస్కూల్లో శనివారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా గుండు సురేందర్, ప్రధాన కార్యదర్శిగా ఎస్.నర్సింహరాజు, ఉపాధ్యక్షులుగా ఎస్.రాధిక, కొమ్ము రాజేందర్, జిల్లా కౌన్సిలర్లుగా చీకటి వెంకట్రాంనర్సయ్య, బి.అంజయ్య, ఎం.సదయ్య, కార్యదర్శులుగా జి.మోహనకృష్ణ, బి.చందర్, వి.నర్సయ్య, యు.ప్రణయ్ కుమార్‌లను ఎన్నుకున్నారు.

పీఆర్టీయూ-టీఎస్ మానుకోట మండల కమిటీ ఎన్నిక



సుజాత ప్రధాన కార్యదర్శి | రాంమోజీనాయక్ అధ్యక్షుడు

మహబూబాబాద్ ఎడ్యుకేషన్, సెప్టెంబరు 21 : మహబూబాబాద్ మండల ప్రోగ్రెసివ్ రికగ్నైజ్డ్ టీచర్స్ యూనియన్-తెలంగాణ స్టేట్ (పీఆర్టీయు-టీఎస్) నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు సంఘం జిల్లా అధ్యక్షుడు సంకా బద్రినారాయణ తెలిపారు. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ బాలికోన్నత పాఠశాలలో శనివారం నిర్వహించిన సంఘ సమావేశంలో మండల అధ్యక్షుడిగా భూక్య రామోజీ నాయక్, ప్రధాన కార్యదర్శిగా కాపరబోయిన సుజాత, అసోసియేట్ అధ్యక్షుడిగా కె. నాగరాజు, ఉపాధ్యక్షులుగా బి.విజయ్, బి.కౌసల్య, కార్యదర్శులుగా వి.మధు, సుశీలలను ఎన్నుకున్నట్లు ప్రకటించారు. సమావేశంలో జిల్లా ప్రధాన కార్యదర్శి మిర్యాల సతీష్‌రెడ్డి, నాయకులు కళ్లెం వెంకట్‌రెడ్డి, మురళీధరస్వామి, బి.గీత, ఉమాదేవి, హల్యానాయక్, విజయ్‌కుమార్, కనకయ్య, మహమూద్ అలీ పాల్గొన్నారు.

ఎవరికీ పట్టని చెక్‌డ్యాంలు

(5వ పేజీ తరువాయి)

ఆకేరువాగులో చెక్‌డ్యాం పూర్తిగా కూలిపోయింది. కోట్లాది రూపాయలతో నిర్మించిన చెక్‌డ్యాం కూలిపోయి నప్పటికీ అధికారులు, ప్రజాప్రతినిధులు పట్టించుకోవడం లేదని రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

నీటి నిల్వలకు ఇబ్బందులు..

నెల్లికుదురు మండలంలో అవసరంలేని చోట చెక్‌డ్యాములు నిర్మించడంతో అవి రైతులకు ఉపయోగకరంగా లేవు. వర్షకాలంలో నీరు నిల్వఉన్నా, వేసవి సీతాకాలలో నీరు ఇంకిపోయి నిరుపయోగంగా మారాయి. ఇప్పటికైనా లీటలు ఏర్పడిన చెక్‌డ్యామ్‌లను మరమ్మతులు చేపట్టి, నీరునిల్వ ఉండే మైదాన ప్రాంతాలలో కొత్త చెక్‌డ్యాములు నిర్మిస్తే వర్షపు నీరు ఉంటుందని రైతులు కోరుతున్నారు.

స్కూళ్ల బలోపేతంలో తల్లిదండ్రుల పాత్ర కీలకం

- జడ్పీ ఇన్‌చార్జి సీఈవో నర్మద

మహబూబాబాద్ ఎడ్యుకేషన్, సెప్టెంబరు21 : ప్రభుత్వ పాఠశాలల బలోపేతం చేయడంలో తల్లిదండ్రుల పాత్ర కీలకమని జడ్పీ ఇన్‌చార్జి సీఈవో నర్మద అన్నారు. మహబూబాబాద్ జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలు, కస్తూర్బాగాంధీ బాలికా విద్యాలయాలు, ఆదర్శ పాఠశాలల్లో శనివారం పేరెంట్స్ టీచర్స్ సమావేశాలు (పీటీఎ) నిర్వహించారు. ఆయా పాఠశాలల్లో నిర్వహించిన టీచర్స్ పేరెంట్స్ సమావేశాలకు డీఈవో రాజేశ్వర్‌తోపాటు నర్మద, మండల విద్యాధికారులు, మండల ప్రత్యేకాధికారులు, నోడల్ అధికారులు పాల్గొని ప్రసంగించారు. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ బాలికోన్నత పాఠశాలలో నిర్వహించిన టీచర్స్ పేరెంట్స్ సమావేశంలో డీఈవో పాల్గొని మాట్లాడుతూ విద్యార్థులు, విద్యార్థినులను క్రమం తప్పకుండా పాఠశాలలకు వచ్చే విధంగా తల్లిదండ్రులు ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యనభ్యసిస్తున్న విద్యార్థులకు ప్రభుత్వం కల్పిస్తున్న సౌకర్యాలను వినియోగించుకొని ఉన్నత విద్యనభ్యసించి జీవితంలో స్థిరపడేలా తల్లిదండ్రులు ప్రోత్సహించాలన్నారు. విద్యార్థులు తరగతుల వారీగా సామర్థ్యాలు సాధించే విధంగా బోధన చేయాలని ఉపాధ్యాయులకు సూచించారు. సీజనల్ వ్యాధులు ప్రబలుతున్న నేపథ్యంలో విద్యార్థుల ఆరోగ్యం పట్ల తల్లిదండ్రులు తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.

సీరోలు మండలం మన్నెగూడెం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన పీటీఏ సమావేశానికి జడ్పీ ఇన్‌చార్జి సీఈవో నర్మద హాజరయ్యారు. అనంతరం తరగతి గదులకు వెళ్లి ఉపాధ్యాయులు విద్యార్థులకు బోధిస్తున్న టీచర్ లెర్నింగ్ మెటీరియల్‌ను పరిశీలించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ పాఠశాలల్లో విద్యనభ్యసిస్తున్న విద్యార్థులకు మధ్యాహ్న భోజనం, ఉచిత పాఠ్యపుస్తకాలు, రెండు జతల యూనిఫాంలు, నోట్‌పుస్తకాలు, రవాణా చార్జీలు కూడా ప్రభుత్వం అందిస్తుందని పేర్కొన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులు బోధన చేస్తుండటంతో పాటు సకల సౌకర్యాలు కల్పించడం జరుగుతుందన్నారు. రోజు ఒకపేరెంట్ పాఠశాలకు వచ్చి విద్యార్థుల ప్రగతిని తెలుసుకోవాలని సూచించారు. విద్యాశాఖ జిల్లా సెక్టోరియల్ అధికారులు, హెచ్ఎంలు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.



మహబూబాబాద్ ప్రభుత్వ బాలికోన్నత పాఠశాల టీచర్స్ పేరెంట్స్ సమావేశంలో మాట్లాడుతున్న డీఈవో రాజేశ్వర్

కొండా లక్ష్మణ్‌బాపూజీకి భారతరత్న ప్రకటించాలి

- జాతీయ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి శంతన్‌రామారాజు



కొండా లక్ష్మణ్ బాపూజీ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న జాతీయ బీసీ సంక్షేమ సంఘం నేతలు

మహబూబాబాద్ టౌన్, సెప్టెంబరు 21 : పోరాటాల స్ఫూర్తిదాత, ప్రజాస్వామికవాది, తెలంగాణ తొలి, మలిదశ ఉద్యమకారులు కొండా లక్ష్మణ్ బాపూజీకి భారతరత్న ఇవ్వాలని జాతీయ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి శంతన్‌రామారాజు అన్నారు. మహబూబాబాద్ పట్టణంలో జాతీయ బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో కొండా లక్ష్మణ్ బాపూజీ వర్ధంతిని శనివారం నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా వాంకిడి గ్రామంలో 1915 సంవత్సరంలో తన జీవితాన్ని సమాజానికి అంకితం చేసిన మహోన్నత వ్యక్తి కొండా లక్ష్మణ్ బాపూజీ అని చెప్పారు. దేశ స్వాతంత్ర్యపోరాటం, తొలి, మలిదశ తెలంగాణ ఉద్యమానికి ఊపిరీలూదిన పోరాట యోధుడు, తెలంగాణ ఉద్యమవేదిక కోసం జలదృశ్యంలోని తన ఇంటిని, మంత్రి పదవిని త్యాగం చేసిన మహనీయులు తెలంగాణ ఉద్యమ ఫోరం (టీయూఎఫ్) మహబూబాబాద్ పార్లమెంటరీ నియోజకవర్గ అధ్యక్షుడు నారాయణసింగ్, పద్మశాలి సంఘం నాయకులు కొండి సాయికిరణ్, దొంతు నరేష్, దొంతు ఉమా పాల్గొన్నారు.

- కొత్తగూడ : పద్మశాలీ సంఘం ఆధ్వర్యంలో కొండా లక్ష్మణ్ బాపూజీ వర్ధంతిని కొత్తగూడలో నిర్వహించారు. పద్మశాలీ సంఘం మండల అధ్యక్షుడు కుసుమ రాజన్‌బాబు బాపూజీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. పద్మశాలీ సంఘం మండల ప్రధాన కార్యదర్శి గుళ్లపల్లి శ్రీనివాస్, కోశాధికారి దేవుళ్లపల్లి రాజు, కార్యవర్గ సభ్యులు మెరుగు శ్రీను, సామల నాగరాజు, తుమ్మ చందు, అడ్డగట్ల నరేందర్, దేవుళ్లపల్లి రాజేష్, జిల్లా కార్యవర్గ సభ్యులు వెల్దండి వేణు, మహిళ సంఘం నాయకురాలు కుసుమ రాజేశ్వరి, స్రవంతి పాల్గొన్నారు.

మార్కెట్ చైర్మన్ నియామకంపై హర్షం

కేసముద్రం, సెప్టెంబరు 21 : కేసముద్రం వ్యవసాయ మార్కెట్ చైర్మన్‌గా గంట సంజీవరెడ్డిని నియమించడంపట్ల హర్షం వ్యక్తం చేస్తూ ఆయన స్వగ్రామం కల్వలలో శనివారం కాంగ్రెస్ కార్యకర్తలు బాణాసంచా కాల్చి, ర్యాలీ నిర్వహించి హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా గ్రామపార్టీ అధ్యక్షుడు గండి శ్రీనివాస్ మాట్లాడుతూ మార్కెట్ చైర్మన్‌గా రెండోసారి సంజీవరెడ్డికి పదవి దక్కడానికి సహకరించిన నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు. మండల వర్కింగ్ ప్రెసిడెంట్ పెరుమాండ్ల ఎల్లగౌడ్, మోడెం వెంకటేశ్వర్లు, గంట బాలకృష్ణారెడ్డి, రాంమోహన్‌రెడ్డి, ఆకుల సుధాకర్, కొంతం శ్రీనివాస్, పొడేటి దినేష్, రాజయ్య ఓరుగంటి శ్రీనివాస్, పెదగాని రవి, బొడ్డు భిక్షం, బొగ్గుల యాలాద్రి, గండి సాయివిష్ణు పాల్గొన్నారు.

రసాయన మందుల వాడకాన్ని తగ్గించాలి



మాట్లాడుతున్న కేవీకే శాస్త్రవేత్త క్రాంతికుమార్

డోర్నకల్, సెప్టెంబరు 21 : రైతులు సాగు చేసుకునే పంటలకు రసాయిన, క్రిమిసంహారక మందుల వాడకాన్ని తగ్గించాలని కేవీకే మల్యాల శాస్త్రవేత క్రాంతికుమార్ అన్నారు. చిల్కోడు రైతు వేదికలో శనివారం రైతు శిక్షణ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా క్రాంతికుమార్ మాట్లాడుతూ రైతులు మిరప సాగులో యూరియా, ఇతర కాంప్లెక్స్ రసాయినిక ఎరువులను అధిక మోతాదులో ఉపయోగించడంతో భూసారం దెబ్బతింటుందన్నారు. మిరప, మొక్కజొన్న పంటల్లో క్రిమి కీటకాలను ఆకర్షిండానికి బంతిచెట్లను నాటుకోవాలన్నారు. బయో మందులనునిషేధించాలన్నారు. శాస్త్రవేత్త రాంబాబు, ఎంఏవో చాయరాజ్, ఏఈవోలు అవినాష్, అనూష, పవన్, చరణ్ పాల్గొన్నారు.

బీజేపీ బలోపేతానికి కార్యకర్తలు కృషి చేయాలి

- పట్టణాధ్యక్షుడు దేవాసింగ్‌నాయక్

డోర్నకల్, సెప్టెంబరు 21 : భారతీయ జనతా పార్టీ (బీజేపీ) పటిష్టత కోసం కార్యకర్తలు సైనికుల్లా పనిచేయాలని పార్టీ డోర్నకల్ పట్టణాధ్యక్షుడు దేవాసింగ్‌నాయక్ అన్నారు. గొల్లచర్లలో శనివారం పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. దేశంలో అవినీతి రహిత పాలన బీజేపీతోనే సాధ్యమని చెప్పారు. 2047 వరకు ప్రపంచంలో బలమైన ఆర్థిక శక్తిగా దేశాన్ని బీజేపీ నిలుపుతుందన్నారు. గొల్లచర్లలో వందమంది బీజేపీ పార్టీ సభ్యత్వం తీసుకున్నారని తెలిపారు.

ఎస్సీ బాలుర గురుకుల స్కూల్ తనిఖీ

మరిపెడ, సెప్టెంబరు 21 : మరిపెడ ఎస్సీ గురుకుల పాఠశాలను డీఎంహెచ్‌వో డాక్టర్ మురళీధర్ శనివారం అకస్మికంగా తనిఖీ చేశారు. వంటలను పరిశీలించారు. డెర్మెంటరీ గదులు, డైనింగ్ గదులను చెక్‌చేశారు. పరిసరాల పరిశుభ్రత, విద్యార్థుల వ్యక్తిగత శుభ్రతపై ఆరా తీశారు. సిక్ అయిన పిల్లల ఆరోగ్య స్థితిగతులు పరీక్షించారు. దోమల ఈగల నివారణపై సిబ్బందికి అవగాహన కలిపించారు. శానిటేషన్ నిర్వహణ సక్రమంగా ఉండాలని సూచించారు. మండల మెడికల్ ఆఫీసర్ డాక్టర్ రవి, సూపర్‌వైజర్లు, ఏఎన్ఎంలు, ఆ స్కూల్ ప్రిన్సిపాల్ దయాకర్ ఉన్నారు.

'లోక్ అదాలత్‌లను సద్వినియోగం చేసుకోవాలి'

తొర్రూరు, సెప్టెంబరు 21 : రాజీకి అవకాశం ఉన్న కేసులను జాతీయ లోక్ అదాలత్‌లలో సద్వినియోగం చేసుకోవాలని తొర్రూరు కోర్టు జడ్జి మట్ట సరిత కోరారు. శనివారం కోర్టు ఆవరణలో నిర్వహించిన జాతీయ లోక్ అదాలత్‌లో క్రిమినల్, సివిల్ కేసులు, కుటుంబ తగాదాలను పరిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కక్షిదారులు క్షణికావేశాలకు పోకుండా రాజీ మార్గం ద్వారా తమకేసులను సత్వరమే పరిష్కరించుకోవాలని సూచించారు. రాష్ట్ర న్యాయసేవాధికార సంస్థ, జిల్లా న్యాయసేవాధికార సంస్థ ఆదేశాల మేరకు కోర్టులో ప్రిలోక్ అదాలత్ నిర్వహించడం జరిగింది. కోర్టు పరిధిలోని పోలీసులకు సన్నాహక సమావేశం నిర్వహించారు. ప్రి లోక్ అదాలత్‌లో 89 కేసుల్లో రూ. 89 వేల జరిమానా విధించడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో కోర్టు పరిధిలో కోర్టు సిబ్బంది, పోలీసు సిబ్బంది, న్యాయవాదులు పాల్గొన్నారు.

చెరువులకు పడిన గండ్లకు వెంటనే మరమ్మతులు చేపట్టాలి

మరిపెడ రూరల్, సెప్టెంబరు 21 : మండలంలో కురిసిన భారీ వర్షాలకు చెరువులకు పడిన గండ్లను వెంటనే పూడ్చాలని ఉల్లేపల్లి తాజామాజీ సర్పంచ్ చిర్రబోయిన ప్రభాకర్ డిమాండ్ చేశారు. శనివారం ఉల్లేపల్లిలో ఆయన మాట్లాడారు. ఉల్లేపల్లిలోనే జమ్మిచెరువు, ఊరచెరువులకు గండ్లు పడడంతో ఆ చెరువులలో చుక్క నీరు కూడా లేదు. తక్షణమే ఆ చెరువులను యుద్ధ ప్రాతిపదికన మరమ్మతులు చేసినట్లయితే వచ్చే వేసవిలో ఎస్సారెస్పీ జలాలతో నింపుకోవచ్చన్నారు. ప్రభుత్వవిప్, డోర్నకల్ ఎమ్మెల్యే రామచందర్‌నాయక్, ఎంపీ పోరిక బలరాంనాయక్, అధికారులు చొరవ చూపాలని కోరారు. గ్రామస్థులు, రైతులు పాల్గొన్నారు.

జైనూర్ బాధితురాలికి న్యాయం చేయాలి

- తుడుందెబ్బ రాష్ట్ర కో కన్వీనర్ ఆగబోయిన రవి



బంద్‌లో నినాదాలు చేస్తున్న తుడుందెబ్బ నాయకులు

కొత్తగూడ, సెప్టెంబరు 21 : కొమురంభీం అసిఫాబాద్ జిల్లా జైనూర్‌లో మండలంలో బాధితురాలికి ప్రభుత్వం న్యాయం చేయాలని, నిందితుడిని కఠినంగా శిక్షించాలని తుడుందెబ్బ రాష్ట్ర కోకన్వీనర్ ఆగబోయిన రవి డిమాండ్ చేశారు. జైనూర్ మండలంలో మెస్రం లీలాబాయిపై ఆటోడ్రైవర్ అఘాయిత్యాన్ని నిరసిస్తూ తుడుందెబ్బ ఆధ్వర్యంలో చేపట్టిన రాష్ట్ర బంద్ కొత్తగూడ, గంగారం మండలాల్లో విజయవంతంగా ముగిసింది. కార్యక్రమంలో కుంజ నర్సింగరావు, అల్లెం జంపయ్య, పూనెం సందీప్, ఈక విజయ్‌కుమార్, వజ్జ రవి, కల్తి నరేష్, పుల్సం మునేష్, మల్లెల సారయ్య, సిద్ధబోయిన లక్ష్మీనారాయణ పాల్గొన్నారు. కాగా, ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా సీఐ బాబురావు, కొత్తగూడ, గంగారం ఎస్సైలు కుశకుమార్, రవికుమార్ తమ సిబ్బందితో బందోబస్త్ నిర్వహించారు.

మాజీ ఎమ్మెల్యే శంకర్‌నాయక్‌కు పితృవియోగం

- రాయపర్తి మండలం బాలాజీ తండాలో కేవ్లానాయక్ మృతి
- నివాళులర్పించిన మాజీ మంత్రులు ఎర్రబెల్లి, రెడ్యానాయక్



కేవ్లానాయక్ (ఫైల్)



కేవ్లానాయక్ మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న దయాకర్ రావు

మహబూబాబాద్ టౌన్, సెప్టెంబరు 21 : మహబూబాబాద్ నియోజకవర్గ మాజీఎమ్మెల్యే బానోత్ శంకర్‌నాయక్ తండ్రి కేవ్లానాయక్ (105) శనివారం తుదిశ్వాస విడిచారు. గత కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన సొంత గ్రామం వరంగల్ జిల్లా రాయపర్తి మండలం ఊకల్ గ్రామశివారు బాలాజీతండాలో కన్నుమూశారు. మృతుడికి భార్య, ఆరుగురు కుమారులు, ముగ్గురు కుమార్తెలు సంతానం. కేవ్లానాయక్ మృతివార్త తెలుసుకున్న మాజీ మంత్రులు ఎర్రబెల్లి దయాకర్‌రావు, డీఎస్. రెడ్యానాయక్ బాలాజీ తండాకు చేరుకుని ఆయన మృతదేహం వద్ద నివాళులర్పించి, వారి కుటుంబసభ్యులకు తన ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు. మహబూబాబాద్ అసెంబ్లీ నియోజకవర్గానికి చెందిన వివిధ రాజకీయ పార్టీలు, ప్రజాప్రతినిధులు, వివిధ సంఘాల నాయకులు పాల్వాయి రాంమోహన్‌రెడ్డి, ఎమ్మీ. ఫరీద్, డోలి సత్యనారాయణ, బొడ్డుపల్లి ఉపేంద్రం, అంబటి రవీందర్, రామసహాయం వెంకట్‌రెడ్డి, మైస శ్రీనివాస్, లూనావత్ అశోక్‌నాయక్, బాలాజీనాయక్, పరిపాటి వెంకట్‌రెడ్డి, ఎర్రబెల్లి మాధవి, నాయిని రంజిత్, తేళ్ల శ్రీనివాస్, చిట్యాల జనార్ధన్, ఆవుల వెంకన్న, మార్నేని రఘు, ముత్యం వెంకన్న, డౌలాగర్ శంకర్ కేవ్లానాయక్ మృతదేహాన్ని సందర్శించి వారి కుటుంబసభ్యులకు తమ ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు. కాగా, కేవ్లానాయక్ అంత్యక్రియలు ఆదివారం ఉదయం 9 గంటలకు బాలాజీ తండాలో నిర్వహించనున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

మృతుడి కుటుంబానికి ప్రభుత్వం అండగా ఉంటుంది

ఇల్లెందు ఎమ్మెల్యే కోరం కనకయ్య

గార్ల సెప్టెంబరు 21 : పాత పోచారంలో శుక్రవారం పిడుగుపాటుకు గురై మృతి చెందిన అల్లం ప్రవీణ్ కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకుంటుందని ఇల్లెందు ఎమ్మెల్యే కోరం కనకయ్య హామీ ఇచ్చారు. శనివారం పాత పోచారంలో పిడుగు పాటుకు మృతి చెందిన ప్రవీణ్‌కుటుంబాన్ని పరామర్శించి, ప్రవీణ్ భౌతిక కాయంపై పూలమాల వేసి నివాళులర్పించారు. పీఏసీఎస్ చైర్మన్ వడ్లమూడి దుర్గాప్రసాద్, మన్నేపల్లి వెంకయ్య, లింగాల నాగేశ్వరరావు బయ్యా సురేష్ యాదవ్, పసుపులేటి వెంకటేశ్వర్లు, అల్లం వెంకటేశ్వర్లు పాల్గొన్నారు. అనంతరం సత్యనారాయణపురంలో నిర్మాణంలో ఉన్న సబ్‌స్టేషన్ పనులను ఎమ్మెల్యే కనకయ్య సందర్శించి, వివరాలను అడిగి తెలుసుకున్నారు.



ప్రవీణ్ మృతదేహంపై పూలమాల వేసి, నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే కోరం కనకయ్య

పురుగుల మందుతాగి ఫీల్డ్ అసిస్టెంట్ ఆత్మహత్య



శ్రీనివాస్ (ఫైల్)

పెద్దవంగర, సెప్టెంబర్ 21 : పురుగుల మందుతాగి ఫీల్డ్ అసిస్టెంట్ ఆత్మహత్య చేసుకున్న ఘటన పోచంపల్లిలో శనివారం చోటు చేసుకుంది. ఎస్సై క్రాంతికిరణ్ తెలిపిన వివరాల ప్రకారం. పోచంపల్లికి చెందిన కోటగిరి శ్రీనివాస్ (42) గ్రామంలోనే ఫీల్డ్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తూ.. తనకు ఉన్న మూడెకరాల వ్యవసాయం సాగుచేస్తూ జీవనం సాగిస్తున్నాడు. సొంత ఇంటి నిర్మాణం, పంటపెట్టుబడి కోసం అధిక మొత్తంలో అప్పు చేశాడు. పంట దిగుబడి రాకపోవడంతో పాటు అప్పుల బాధతో తీవ్ర మనస్థాపనికి గురై బుధవారం వ్యవసాయ పనుల నిమిత్తం పొలం దగ్గరికి వెళ్లి పురుగుల మందుతాగినట్లు తెలిపారు. శ్రీనివాస్ అచూకీ కోసం భార్య రజిత పొలం వద్దకు వెళ్లిగా అపస్మారక స్థితిలో ఉన్నాడు. వెంటనే చికిత్స నిమిత్తం తొర్రూరులోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ శ్రీనివాస్ శనివారం మృతి చెందినట్లు ఎస్సై క్రాంతికిరణ్ వివరించారు. మృతుడి భార్య కోటగిరి రజిత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి పూర్తి స్థాయిలో దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు.

విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌లో కాఫర్‌వైరు చోరీ

తొర్రూరు రూరల్, సెప్టెంబరు 21 : నాంచారిమడూరు గ్రామశివారులో ఉన్న ఓ విద్యుత్‌ట్రాన్స్‌ఫార్మర్‌లో గుర్తుతెలియని వ్యక్తులు కాఫర్‌వైరు దొంగిలించుకుపోయినట్లు రైతులు వెల్లడిస్తున్నారు. శనివారం రైతులు మంద ఎల్లయ్య, వెంకటనర్సు, రాములు, ఎలేందర్, యాకమల్లు కథనం ప్రకారం. రోజు మాదిరిగానే పొలాలకు నీరు పెట్టడానికి వెళ్లగా ట్రాన్స్‌ఫార్మర్ కింద పడి ఉండగా, అందులో కాఫర్‌వైరు లేదు. దీంతో గుర్తుతెలియన వ్యక్తులు ఈ దొంగతనానికి పాల్పడినట్లు గుర్తించి, విద్యుత్ అధికారులకు సమాచారం ఇచ్చినట్లు తెలిపారు. ఎస్సై జి.ఉపేందర్‌ను వివరణ కోరగా రైతులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు వెల్లడించారు.

అతిథి అధ్యాపకులను రెన్యూవల్ చేయాలి

తొర్రూరు, సెప్టెంబరు 21 : ఇంటర్ బోర్డు అధికారుల తప్పిదం వల్ల పలువురు అతిథి అధ్యాపకులను ప్రభుత్వం రెన్యూవల్ చేయలేదని, వారిని వెంటనే రెన్యూవల్ చేయాలని ఎస్సీ ఎస్టీ గెజిటెడ్ అధ్యాపకుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బరిగెల నారాయణ కోరారు. శనివారం తొర్రూరులో ఆయన మాట్లాడుతూ ఇంటర్‌బోర్డు రాష్ట్ర ఫైనాన్స్ విభాగంకు తప్పుడు జాబితా ఇచ్చిందని, దానివల్ల 65 మంది కుటుంబాలు రోడ్డున పడే పరిస్థితి వచ్చిందన్నారు. వెంటనే అతిథి అధ్యాపకులను రెన్యూవల్ చేయాలని డిమాండ్ చేశారు. శివరామకృష్ణ, అలి, రాజేష్, నరేష్ ఉన్నారు.

అధ్యాపక పోస్టులకు దరఖాస్తు చేసుకోవాలి

నర్సింహులపేట, సెప్టెంబరు 21 : నర్సింహులపేట మోడల్ స్కూల్‌లో అధ్యాపక పోస్టుల భర్తీకి అర్హులైన వారు దరఖాస్తు చేసుకోవాలని పాఠశాల ప్రిన్సిపల్ జి.నాగిరెడ్డి శనివారం తెలిపారు. పాఠశాలలో 9వ తరగతి నుంచి ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం వరకు జీవశాస్త్రం, బోటనీ, సోషల్, ఎకనామిక్స్ బోధించడానికి అనుభవం, అర్హత కలిగిన ఎమ్మెస్సీ, ఎంఏ- బీఈడి పూర్తి చేసిన వారు అర్హులన్నారు. ఇంగ్లీష్‌లో బోధించే సామర్థ్యం కలిగి ఉండాలన్నారు. ఈనెల 23న పాఠశాలలో అర్హత సర్టిఫికెట్‌లతో డెమోక్లాస్‌కు హాజరై ఎంపికైన అభ్యర్థులకు ప్రతీ పిరీయడ్‌కు రూ.182 చొప్పున, నెలసరి రూ.18,200 వేతనం చెల్లించడం జరుగుతుందన్నారు. నియామకం తాత్కాలికమన్నారు. ఆసక్తిగల అభ్యర్థులు డెమోక్లాస్‌కు హాజరై అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ప్రిన్సిపల్ నర్సిరెడ్డి కోరారు.

సర్దుబాటు ఉత్తర్వులను ఉపసంహరించాలి

తొర్రూరు, సెప్టెంబరు 21 : ప్రభుత్వం ఓ వైపు విద్యారంగం బలోపేతం కోసం అన్ని విధాలుగా కృషి చేస్తామని చెపుతూ అశాస్త్రీయంగా ఉపాధ్యాయుల సర్దుబాటు చేయాలనే ఆదేశాలను వెంటనే ఉపసంహరించుకోవాలని టీఎస్‌యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు మురళీకృష్ణ డిమాండ్ చేశారు. శనివారం తొర్రూరులో మాట్లాడుతూ ప్రాథమిక పాఠశాలల్లో 10 మంది పిల్లల వరకు ఒకరు, 11 నుంచి 60 మంది విద్యార్థులకు ఇద్దరు ఉపాధ్యాయులు ఉంటే నాణ్యమైన విద్య అందదని ప్రజల విశ్వాసం కోల్పోయే ప్రమాదం ఉందన్నారు. ఉపాధ్యాయుల సర్దుబాటుకు జారీ చేసిన ఉత్తర్వులను ఉపసంహరించుకోవాలని టీయూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు దరావత్ కిషన్‌నాయక్ డిమాండ్ చేశారు. ప్రభుత్వం నిర్లక్ష్య వైఖరిని విడనాడి జీవోను ఉపసంహరించుకోవాలన్నారు. ఉపాధ్యాయులు బోడ రమేష్, రవి, కవిత, బీమా, నాగమల్లయ్య రఫి, రంజిత్, రాయలు, యాకయ్య పాల్గొన్నారు.

'పేద విద్యార్థులను ఆదుకోవడం అభినందనీయం'

తొర్రూరు, సెప్టెంబరు 21 : ప్రభుత్వ పాఠశాలల్లో చదివే పేదవిద్యార్థులను ఆదుకోవడం అభినందనీయమని లయన్స్‌క్లబ్ చార్టర్డ్ ప్రెసిడెంట్ రాజేందర్‌రెడ్డి అన్నారు. శనివారం తొర్రూరులోని క్లబ్ ఆవరణలో ప్రభుత్వ పాఠశాలల్లో విద్యనభ్యసించే పేద విద్యార్థినులకు లయన్స్ క్లబ్ సాకారంతో సైకిల్స్ అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలోనే అత్యుత్తమమైన పదవులు అధిరోహించి, మొదటి ఉపాధ్యాయుడైన సర్వేపల్లి రాధాకృష్ణ జన్మదిన సందర్భంగా క్లబ్‌సభ్యులు సేవా కార్యక్రమాలు గత 5 రోజులుగా చేపట్టడం అభినందనీయం అన్నారు. క్లబ్ అధ్యక్షుడు చిదిరాల నవీన్, తమ్మి రమేష్, కిరణ్ కుమార్, వెంకట్ రెడ్డి, రేగూరి వెంకన్న, శారద, విశ్వేశ్వర రావు, శ్రీదేవి, బుచ్చయ్య, రవీంద్ర, క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

ఆకేరు వాగులో ఇసుక లొల్లి?!

- పోలీస్‌స్టేషన్‌లో ఇరువురు ఫిర్యాదు

నర్సింహులపేట, సెప్టెంబరు 21 : మండలంలోని కౌసల్యదేవిపల్లి శివారు ఆకేరువాగులో శుక్రవారం అర్ధరాత్రి ట్రాక్టర్ యజమాని, ట్యాక్సీ వసూలు చేసే వ్యక్తుల మధ్య లొల్లి జరిగి, కొట్టుకున్న విషయం శనివారం వెలుగులోకి వచ్చింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం. కౌసల్యదేవిపల్లి గ్రామ శివారు ఆకేరు వాగు నుంచి శుక్రవారం అర్ధరాత్రి కొందరు అక్రమంగా ఇసుక తరలిస్తున్న క్రమంలో వాగు పరివాహకంలో ఇటీవల వ్యవసాయ భూమిని కొనుగోలు చేసిన రైతు బంధువు రూప్లాతండాకు చెందిన ఓవ్యక్తి ఇసుక ట్రాక్టర్ల నుంచి ట్యాక్సీ వసూలు చేసేందుకు మరో ఇద్దరితో కలిసి ఆకేరు వాగు పరివాహకానికి వెళ్లి మాటు వేశాడు. ఇసుక లోడుతో అటుగా వచ్చిన ట్రాక్టర్ నుంచి ట్యాక్సీ ఇవ్వాలని మొండికేయడంతో ట్రాక్టర్ యజమాని నీ భూమి కాదు.. ట్యాక్సీ ఎలా ఇచ్చేది? అని ప్రతిఘటించడంతో ఇద్దరి మధ్య మాటలు పెరిగి ఒకరిపై ఒకరు చేయి చేసుకున్నట్లు సమాచారం. శనివారం తెల్లవారు జామున ఇద్దరు ఒకరుపై ఒకరు స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసుకున్నారు. ఈ విషయంపై ఎస్సై ఎం.సురేష్‌ను వివరణ కోరగా ఘర్షణకు పాల్పడిన వారు ఇద్దరు ఠాణాలో ఫిర్యాదు చేశారని, విచారణ జరిపి చర్యలు తీసుకుంటామన్నారు.

అమ్మాపురం గ్రామంలో అవకతవకలపై సెర్ప్ అధికారుల విచారణ

తొర్రూరు రూరల్, సెప్టెంబరు 21 : మండలంలోని అమ్మాపురం గ్రామంలోని మహిళా సంఘాల్లో జరిగిన అవకతవకలపై సెర్ప్ అధికారులు శనివారం విచారణ చేపట్టారు. గ్రామంలో పదకొండు గ్రూపుల్లో మహిళా సంఘాల సభ్యులు చెల్లించిన డబ్బులు వీవోఏలు ఖాతాల్లో జమ చేయకుండా అవకతవకలకు పాల్పడారని 31 మందిసభ్యులు వచ్చిన ఫిర్యాదు మేరకు డీఆర్డీఏ సెర్ప్ కమిషనర్ ఆదేశాల మేరకు విచారణ చేపట్టినట్లు స్పెషల్ ఆఫీసర్లు జి.సీతారాములు, ప్రశాంత్‌రెడ్డి తెలిపారు. ఈ మేరకు వారు మాట్లాడుతూ ఇప్పటి వరకు ఆరు గ్రూపుల వరకు మాత్రమే విచారించామని, మిగతావి పూర్తి చేస్తే ఎవ్వరూ ఎంత వరకు అవకతవకలకు పాల్పడ్డాని తేలాల్సి ఉంది. పూర్తి నివేదిక జిల్లా కలెక్టర్, పీడీకి నివేదిస్తామని తెలిపారు. ఈ విచారణలో డీపీఎం శ్రీనివాస్, ఏపీఎంలు సంజీవరావు, ఉపేందర్, ఆయా సంఘాల మహిళ సభ్యులు ఉన్నారు. కాగా, గత ఐదు సంవత్సరాల నుంచి గ్రామంలో అవకతవకలు జరుగుతున్నాయని ఫిర్యాదులు వస్తున్నా విచారణకు వస్తున్న స్థానిక అధికారులు నామమాత్రంగా చేస్తున్నారని ఖమ్మం జిల్లాకు చెందిన అధికారులను విచారణ అధికారులుగా నియమించినట్లు సభ్యులు వెల్లడిస్తున్నారు.